



అనంతపురం స్ట్రాంగ్ రూమ్‌కు గదికి తాళం వేస్తున్న కలెక్టర్ వినోద్‌కుమార్



ఓట్ల లెక్కలు తేలాయి..!

- స్వల్పంగా పెరిగిన ఓటింగ్
- ఓట్ల పరంగా భారీగా పెరుగుదల
- పెరిగిన ఓట్లు ఎటువైపన్న అంచనాల్లో పార్టీలు



ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

సార్వత్రిక ఎన్నికల ఓట్ల లెక్కలు తేలాయి. సోమవారం జరిగిన ఓటింగ్‌కు సంబంధించి ఎక్కడ ఎంత మేరకు పోలింగ్ జరిగిందన్న వివరాలు మంగళవారం నాటికి తేలాయి. సోమవారం ఉదయం నుంచి రాత్రి ఎనిమిది, తొమ్మిది గంటల వరకు పోలింగ్ జరిగింది. 2019తో పోలిస్తే స్వల్పంగా ఓటింగ్ పెరిగినట్టు కనిపించినా... ఓట్ల పరంగా చూసినప్పుడు భారీ వ్యత్యాసమే కనిపిస్తోంది. ఎందుకంటే 2019 ఎన్నికల సమయంలో ఉమ్మడి అనంతపురం జిల్లాగా ఉండేది. ఆ సమయంలో అనంతపురం, హిందూపురం పార్లమెంటు పరిధిలో కలిపి మొత్తం 32,39,498 ఓట్లు ఉండగా 26,54,257 ఓట్లు పోలయ్యాయి. అంటే మొత్తం ఓట్లలో 82.22 శాతం పోలింగ్ జరిగింది. ఈసారి అంటే 2024 సార్వత్రిక ఎన్నికలకు వచ్చే సరికి ఉమ్మడి అనంతపురం జిల్లాలోని 14 అసెంబ్లీ, రెండు పార్లమెంట్ స్థానాలకు కలిపి మొత్తం 30,41,924 ఓట్లు ఉన్నాయి. ఇందులో 26,54,257 ఓట్లు పోలయ్యాయి. అంటే మొత్తంగా చూసినప్పుడు 82.91 శాతం ఓట్లు పోలయ్యాయి. ఓట్ల పరంగా చూస్తే 2019 కంటే ఈసారి 3,87,667 ఓట్లు అధికంగా పోలయ్యాయి. శాతంలో స్వల్పమే అనిపించినప్పటికీ ఓట్లలో చూసినప్పుడు భారీగా పెరుగుదల కనిపిస్తోంది.

2019 సార్వత్రిక ఎన్నికల సందర్భంగా ఉమ్మడి అనంతపురం జిల్లాలో ఓట్ల శాతం వివరాలు

నియోజకవర్గం	మొత్తం ఓటర్లు	పోలైన ఓట్లు	శాతం
రాయదుర్గం	2,49,553	2,14,668	86.03
ఉరవకొండ	2,15,744	1,85,981	86.22
గుంతకల్లు	2,52,373	1,91,252	75.81
తాడిపత్రి	2,34,741	1,90,728	81.26
శింగనమల	2,35,044	1,98,481	84.44
అనంతపురం	2,55,682	1,62,548	63.58
కళ్యాణదుర్గం	2,19,591	1,90,492	86.75
మొత్తం	16,62,728	13,34,150	80.23
నియోజకవర్గం	**మొత్తం ఓటర్లు**	**పోలైన ఓట్లు**	**శాతం**
రాప్తాడు	2,45,435	2,02,058	82.32
మడకశిర	2,01,825	1,78,357	88.36
హిందూపురం	2,29,262	1,77,903	77.59
పెనుకొండ	2,20,383	1,91,708	86.98
పుట్టపర్తి	1,99,675	1,70,450	85.37
ధర్మవరం	2,40,323	2,07,869	86.50
కదిరి	2,39,867	1,91,762	79.95
మొత్తం	15,76,770	13,20,107	81.93
మొత్తం	32,39,498	26,54,257	81.93

2024 సార్వత్రిక ఎన్నికల సందర్భంగా ఉమ్మడి అనంతపురం జిల్లాలో ఓట్ల శాతం వివరాలు

నియోజకవర్గం	మొత్తం ఓటర్లు	పోలైన ఓట్లు	శాతం
రాయదుర్గం	2,64,352	2,27,248	85.964
ఉరవకొండ	2,24,339	1,92,441	85.781
గుంతకల్లు	2,70,648	2,03,820	5.308
తాడిపత్రి	2,48,880	2,06,703	83.053
శింగనమల	2,47,373	2,05,068	82.898
అనంతపురం	2,81,214	1,83,018	65.081
కళ్యాణదుర్గం	2,30,785	2,05,143	8.889
మొత్తం	1767591	1423441	80.530
నియోజకవర్గం	**మొత్తం ఓటర్లు**	**పోలైన ఓట్లు**	**శాతం**
రాప్తాడు	2,50,571	2,13,207	85.09
మడకశిర	2,10,804	1,84,453	87.50
హిందూపురం	2,49,174	1,93,882	77.81
పెనుకొండ	2,35,986	2,05,213	86.96
పుట్టపర్తి	2,11,062	1,82,083	86.27
ధర్మవరం	2,45,758	2,18,282	88.82
కదిరి	2,53,420	2,06,207	81.37
మొత్తం	16,56,775	14,03,327	84.70
మొత్తం	34,24,366	28,26,768	82.54

గెలుపుపై ఎవరి అంచనాలు వారివి..!

ఓటింగ్ సరళి, పోలయిన లెక్కలను చూసుకుని ఆయా పార్టీలు ఎవరి అంచనాలు వారు వేసుకుంటున్నారు. పోలింగ్ బూత్‌ల వారీగానూ ఎక్కడ ఎన్ని ఓట్లు వచ్చి ఉండవచ్చునని లెక్కలు వేసుకునే పనిలో అభ్యర్థులు పడ్డారు. పెరిగిన ఓట్ల సంఖ్య తమకు లాభిస్తుందంటే.. తమకు లాభిస్తుందని ధీమాలు వ్యక్తం చేస్తున్నారు. అయితే లోలోన మాత్రం ప్రధాన పార్టీల అభ్యర్థుల్లో గుబులు కనిపిస్తోంది. దీంతో రాజకీయ విశ్లేషకులతో సైతం తమ భవితవ్యం ఏ రకంగా ఉండనుందన్న అభిప్రాయాలను సేకరిస్తున్నారు.

అనంతలో మూడు... హిందూపురంలో నాలుగు నియోజకవర్గాల్లో పెరుగుదల..

అనంతపురం పార్లమెంటు పరిధిలో చూసినప్పుడు తాడిపత్రి, అనంతపురం, కళ్యాణదుర్గం నియోజకవర్గాల్లో అంతకమునుపు కంటే ఓటింగ్ శాతం పెరిగింది. తాడిపత్రిలో 2019 ఎన్నికల సమయంలో 81.26 శాతం ఓటింగ్ జరిగితే ఈసారి 83.05 శాతం జరిగింది. 1.79 శాతం పోలింగ్ పెరిగింది. అనంతపురంలో అంతకు మునుపు 63.58 శాతం పోలింగ్ జరిగితే ఈసారి 65.08 శాతం పోలింగ్ జరిగింది. 1.5 శాతం పెరిగింది. ఇక కళ్యాణదుర్గంలో అంతకు మునుపు 86.75 శాతం కాగా ఈసారి 88.89 శాతం పోలింగ్ జరిగింది. అంటే 2.14 శాతం పెరిగింది. హిందూపురం పార్లమెంట్ పరిధిలోకి వచ్చే సరికి రాప్తాడు, హిందూపురం, రాప్తాడు, పుట్టపర్తి, ధర్మవరం, కదిరిలో ఓటింగ్ శాతం పెరిగింది. పెరిగిన ఓట్లు ఎటువైపు మళ్లాయన్నది చూడాల్సి ఉంది.

శ్రీ సత్యసాయి జిల్లా వ్యాప్తంగా 84.82 శాతం పోలింగ్

పుట్టపర్తి అర్బన్ : సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి శ్రీసత్యసాయి జిల్లా వ్యాప్తంగా 84.82 శాతం పోలింగ్ నమోదు అయినట్లు ఎన్నికల అధికారులు తెలియజేశారు. రాప్తాడు నియోజకవర్గంలో 2,50,571 మంది ఓటర్లు ఉండగా 2,13,010 ఓట్లు పోల్ కాగా 85.01 శాతం నమోదు అయ్యింది. మడకశిర 2,10,804 మంది ఓటర్లు ఉండగా 1,84,454 ఓట్లు పోల్ కాగా 87.50 శాతం పోలింగ్ నమోదు అయ్యింది. హిందూపురంలో 2,49,174 మంది ఓటర్లు ఉండగా 1,93,882 ఓట్లు పోలయ్యాయి. 77.81 శాతం పోలింగ్ నమోదు అయ్యింది. పెనుకొండ 2,35,986 మంది ఓటర్లు ఉండగా 2,05,213 ఓట్లు పోలయ్యాయి. 86.96, శాతం పోలింగ్ నమోదు అయ్యింది. పుట్టపర్తి 2,11,062 మంది ఓటర్లు ఉండగా 1,82,083 ఓట్లు పోల్‌కాగా 86.27 శాతం పోలింగ్ నమోదు అయ్యింది. ధర్మవరం 2,45,758 మంది ఓటర్లు ఉండగా 2,18,282 ఓట్లు పోల్ కాగా 88.82 శాతం పోలింగ్ నమోదు అయ్యింది. కదిరి నియోజకవర్గంలో 2,53,420 మంది ఓటర్లు ఉండగా 2,06,208 ఓట్లు పోల్ కాగా 81.37 శాతం పోలింగ్ నమోదు అయ్యింది. హిందూపురం పార్లమెంటు స్థానంలో 16,56,775 మంది ఓటర్లు ఉండగా 14,05,277 ఓట్లు పోల్ అయ్యాయి. 84.82 శాతం పోలింగ్ నమోదు అయ్యింది. గత సాధారణ ఎన్నికల కంటే ఈసారి పోలింగ్ శాతం పెరిగింది. ప్రధానంగా యువత, మహిళలు, ఉద్యోగులు, తటస్థ ఓటర్ల ఓటర్లు ఓటు వేసేందుకు ఉత్సాహం చూపారు.

స్ట్రాంగ్‌రూముల్లో భవితవ్యం..!

జెఎన్‌టియుకు చేరిన అనంత జిల్లా పోల్డ్ ఈవీఎంలు

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి అభ్యర్థుల భవితవ్యం స్ట్రాంగ్ రూమ్‌లకు చేరింది. అనంతపురం నగరంలోని జెఎన్‌టియులో సాధరణ ఎన్నికల దష్ట్యా పార్లమెంట్, అసెంబ్లీ నియోజకవర్గాల కోసం ఏర్పాటుచేసిన స్ట్రాంగ్ రూముల్లో పోల్డ్ ఈవీఎంలను భద్రపరిచారు. సోమవారం రాత్రి ఎన్నికలు ముగిసిన తర్వాత ఆయా నియోజకవర్గాల పోలింగ్ కేంద్రాల నుంచి ఈవీఎంలు జెఎన్‌టియు స్ట్రాంగ్ రూమ్‌ల్లోకి చేరాయి. అధికారుల బందోబస్తు, పర్యవేక్షణ నడుమ వీటిని భద్రపరిచారు. బుధవారం వేకువజామున ఈవీఎంలకు సీలింగ్ వేసే కార్యక్రమంలో కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి డాక్టర్ వినోద్ కుమార్.వి పాల్గొన్నారు. ఈయనతో పాటు గుంతకల్లు, తాడిపత్రి, శింగనమల, అనంతపురం అసెంబ్లీ నియోజకవర్గాల ఎన్నికల సాధారణ పరిశీలకులు మనీష్ సింగ్, రాయదుర్గం, ఉరవకొండ, కళ్యాణదుర్గం అసెంబ్లీ నియోజకవర్గానికి సంబంధించిన ఎన్నికల సాధారణ పరిశీలకులు సి.అజయ్ నాథ్ ఝ జాయింట్ కలెక్టర్ కేతన్ గార్గ్, జిల్లా పరిషత్ సీఈవో వైఖోమ్ నిదియా దేవి, అసిస్టెంట్ కలెక్టర్ బొల్లిపల్లి వినూత్న తదితరులు ఉన్నారు. ఆయా పార్టీ అభ్యర్థుల సమక్షంలో ఈవీఎంలను భద్రపరిచి గదులకు సీల్ వేశారు. పోలింగ్ రోజు వీటిని తెరవనున్నారు. ఈవీఎంల భద్రపరిచిన నేపథ్యంలో జెఎన్‌టియు చుట్టూ పోలీసు బందోబస్తును పెద్ద ఎత్తున ఏర్పాటు చేశారు.

లేపాక్షి, హిందూపురానికి సత్యసాయి జిల్లా ఈవీఎంలు

పుట్టపర్తి అర్బన్ : సార్వత్రిక ఎన్నికల పోలింగ్ అనంతరం ఈవీఎం బ్యాలెట్ బాక్స్‌లను స్ట్రాంగ్‌రూమ్‌ల్లో అధికారులు భద్రపరిచారు. సోమవారం జరిగిన ఎన్నికల పోలింగ్ జిల్లాలో పలుచోట్ల అర్ధరాత్రి వరకు జరిగింది. మంగళవారం ఉదయం పోల్డ్ ఈవీఎంలను లేపాక్షి మండలంలోని చోళసముద్రం గ్రామ సమీపంలో డాక్టర్ బిఆర్.అంబేద్కర్ గురుకుల పాఠశాలలో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూములకు తరలించి భద్రపరిచారు. ఈ స్ట్రాంగ్ రూముల్లో ధర్మవరం, పుట్టపర్తి, కదిరి నియోజకవర్గం సంబంధించిన బ్యాలెట్ బాక్సులు ఉన్నాయి. అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో వీటిని భద్రపరిచి గదికి సీల్ చేశారు. ఎన్నికల పరిశీలకులు రామచంద్ర తివారి, కలెక్టర్ అరుణ్ బాబు, ఆర్వోలు వెంకట శివసాయి రెడ్డి, భాగ్యరేఖ, పలువురు రాజకీయ ప్రతినిధుల సమక్షంలో వీటిని భద్రపరిచారు. హిందూపురం, మడకశిర, పెనుకొండ నియోజకవర్గం సంబంధించి హిందూపురం సమీపంలోని మలగూరు వద్ద గల బిట్స్ కళాశాలలో ఈవీఎం బ్యాలెట్ బాక్స్‌లను బద్రపరిచారు. రాప్తాడు నియోజకవర్గానికి సంబంధించిన ఈవీఎంలను అనంతపురం జెఎన్‌టియు కళాశాలకు తరలించారు.



లేపాక్షి చోళసముద్రం స్ట్రాంగ్ రూమ్‌కు తాళం వేస్తున్న అధికారులు

పెరిగిన ఓటింగ్ శాతం ఎవరికి లాభం..!

ఆనందంలో ఇరుపార్టీల అభ్యర్థులు, నాయకులు

నార్పలపై టిడిపి నమ్మకం

యల్లనూరు, పుట్లూరుపై వైసిపి ఆశలు





ప్రజాశక్తి-నార్పల

శింగనమల నియోజకవర్గ వ్యాప్తంగా 86 శాతం పోలింగ్ నమోదు కావడంతో ఇరుపార్టీల అభ్యర్థులు, నాయకులు విజయం ఎవరికి వారు ధీమా వ్యక్తం చేస్తున్నారు. నియోజకవర్గంలో నార్పలలో 85.77, బుక్కరాయసముద్రంలో 75, గార్లదిన్నెలో 73.26, శింగనమలలో 84, యల్లనూరులో 75.11, పుట్లూరులో 83.40 శాతం పోలింగ్ నమోదైంది. వీటిలో నియోజకవర్గంలో ప్రధానమైన నార్పలపై టిడిపి నాయకులు నమ్మకం పెట్టుకోగా, యల్లనూరు, పుట్లూరు మండలాలపై వైసిపి నాయకులు ఆశలు పెట్టుకున్నారు. కాగా వైసిపి తరుపున వీరాంజనేయలు, టిడిపి తరుపున బండారు శ్రావణిశ్రీ పోటీ చేసిన విషయం తెలిసిందే. వైసిపి అధిష్టానం వీరాంజనేయులు పేరును అభ్యర్థిగా ప్రకటించగానే ఆ పార్టీ సీనియర్ నాయకులు నార్పల సత్యనారాయణరెడ్డితోపాటు నియోజవర్గవ్యాప్తంగా వైసిపి నాయకులు అసమ్మతి జెండా ఎగురవేశారు. అయితే స్వయానా సిఎం జగన్ అసమ్మతి నాయకులతో మాట్లాడడంతో తిరిగి అభ్యర్థి కోసం ప్రచారం చేశారు. అయితే ఎవరూ పూర్తిస్థాయిలో పని చేయలేదని, ఎవరికి వారుగా ఉన్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. మరోవైపు నార్పల మండల టిడిపి నాయకుల్లో కూడా అంతర్గత కలహాలు ఉన్నప్పటికీ బహిర్గతం కాకుండా ఏకతాటిపై నిలిచేవిధంగా తమదైన శైలిలో ప్రచారం చేశారు. ఏదిఏమైనా నార్పల మండలంలో టిడిపికే మెజారిటీ వచ్చే అవకాశం ఉందని పలువురు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. అదేవిధంగా బుక్కరాయసముద్రం, శింగనమల మండలాల్లో కూడా టిడిపికే మెజార్టీ రావచ్చనని చెబుతున్నారు. వీటితోపాటు గార్లదిన్నె మండలంపై ఇద్దరు నాయకులు ఎవరికివారు ధీమాలో ఉన్నారు. ఎప్పుడూ వైపిపికి పట్టు ఉండే యల్లనూరు, పుట్లూరు మండలాల్లో యథావిధిగా తమకే మెజారిటీ ఉంటుందని వైసిపి నాయకులు చెబుతున్నారు. అయితే ఈ రెండు మండలాల్లో వైసిపి వారు అనుకున్నంత విధంగా ఏకపక్షంగా ఓటింగ్ సాగలేదని, టిడిపికి కూడా ఓట్లు బాగానే పడ్డాయని ఆ పార్టీవారు ధీమాలో ఉనారు. ఏదిఏమైనా ఇరుపార్టీల నాయకులు మాత్రం విజయంపై ఎవరి ధీమాలో వారు ఉన్నారు. ఓటరు తీర్పు ఎలా ఉందో జూన్ 4వ తేదీ వరకు వేచి చూడాల్సిందే.

భారీ మెజార్టీతో గెలవబోతున్నాం : ప్రకాష్‌రెడ్డి



ప్రజాశక్తి-ఆత్మకూరు

భారీ మెజారిటీతో మళ్లీ గెలవబోతున్నానని రాప్తాడు వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. మంగళవారం అనంతపురంలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ రాప్తాడు నియోజకవర్గంలో వైసిపికి అనుకూలంగా ఏకపక్షంగా ఓటింగ్ సాగిందన్నారు. వృద్ధులు, మహిళలు అత్యధిక సంఖ్యలో పోలింగ్ కేంద్రాల వద్ద బారులుదీరి ఓట్లు వేయడం గమనిస్తే సిఎం జగన్ లేకపోతే తమకు పథకాలు ఇచ్చే దిక్కులేదనే నిర్ణయం తీసుకున్నట్లు అర్థమవుతోందన్నారు. టిడిపి కార్యకర్తల కుటుంబాల్లోని మహిళలు కూడా ఫ్యాన్ గుర్తుకు ఓటేశారన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా జగనన్న ప్రభంజనం ఎలా కొనసాగిందో.. రాప్తాడు నియోజకవర్గంలోనూ అలానే కొనసాగిందన్నారు. ఎన్నికలకు ముందు నియోజకవర్గంలో దాదాపు 14వేల ఓట్లు తొలిగించినా, ఆర్ఓలు, అధికారులను మార్పించినా వీరి ఎత్తులను ప్రజలు చిత్తు చేశారన్నారు. దీనికితోడు పరిటాల సునీత కొడుకు, తమ్ముళ్లు పోలింగ్ కేంద్రాల్లోకి వెళ్లే ప్రయత్నం చేశారన్నారు. రామగిరి మండలం కొండాపురంలో ప్రజలు తిరగబడ్డారన్నారు. అత్యంత సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల్లో పేలవమైన పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారన్నారు. ఇవన్నీ చేసినా మెజారిటీ తగ్గించగలుగుతారేమోగానీ, ఫ్యాన్ ప్రభంజనాన్ని ఆపలేరన్నారు. చాలా కేంద్రాల్లో పోలింగ్ సరళిని గమనించిన టిడిపి ఏజెంట్లు మధ్యాహ్నానికే బయటకు వచ్చే పరిస్థితులు కనిపించాయన్నారు. అనంతపురం రూరల్, ఆత్మకూరు, చెన్నేకొత్తపల్లి మండలాల్లోనే 30 వేల మెజారిటీ వస్తుందని ధీమా వ్యక్తం చేశారు. రామగిరి మండలంలో కూడా ఈసారి వైసిపికే మెజారిటీ రాబోతోందన్నారు. ఇక రాప్తాడు, కనగానపల్లి మండలాల్లోనూ ఎప్పటిలాగానే వైసిపి మెజారిటీ వస్తుందన్నారు. రాబోయే ఐదేళ్లు కూడా జగనన్న నేతృత్వంలో పెద్ద ఎత్తున అభివృద్ధి పనులు చేస్తామన్నారు.

సప్లిమెంటరీ పరీక్షలకు నోటిఫికేషన్ విడుదల

అనంతపురం : శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయ పరిధిలో 1994-95, 2014-15లో డిగ్రీ విద్యను అభ్యసించి ఫెయిల్ అయిన విద్యార్థులు సప్లిమెంటరీ పరీక్షలు రాసేందుకు ఎస్‌కెయు పరీక్షల విభాగం నోటిఫికేషన్ విడుదల చేసింది. ఈసందర్భంగా పరీక్షలు విభాగం కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్ శ్రీరాములునాయక్ మాట్లాడుతూ విద్యార్థి సంఘాలు, ఫైయిల్ అయిన విద్యార్థులు వినతి మేరకు విద్యార్థులు భవిష్యత్‌ను దృష్టిలో ఉంచుకుని ఉపకులపతి హుసేన్‌రెడ్డి ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. ఈ మెగా సప్లిమెంటరీ పరీక్షలు రాసే విద్యార్థులు వారంలోపు అయితే ఎలాంటి అపరాధ రుసుం లేకుండా చెల్లించవచ్చున్నారు. ఒక సబ్జెక్ ఫెయిలై ఉంటే రూ.వెయ్యి, రెండు సబ్జెక్టులు అయితే రూ.2వేలు, మూడు, నాలుగు సబ్జెక్టుల్లో ఫెయిల్ అయిన వారు రూ.4వేలు ఫీజ్ చెల్లించి దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

తాడిపత్రి రణరంగం

- టిడిపి, వైసిపి నాయకుల దాడి, ప్రతి దాడులు
- ఇరుగ్రూపుల మధ్య రాళ్ల వర్షం
- మూడు గంటల పాటు పట్టణంలో హైటెన్షన్
- పోలీసుల టియర్ గ్యాస్ ప్రయోగం
- సిఐకు గాయాలు
- ఒకరి పరిస్థితి విషమం



తాడిపత్రిలో రాళ్లు రువ్వుకుంటున్న టిడిపి, వైసిపి మద్దతుదారులు

ప్రజాశక్తి-తాడిపత్రి రూరల్

తాడిపత్రి నియోజకవర్గ కేంద్రం రణరంగాన్ని తలిపిస్తోంది. టిడిపి, వైసిపి గ్రూపుల మధ్య పోలింగ్ సందర్భంగా నెలకొన్న చిచ్చు దారికి రావడం లేదు. సోమవారం నాడు పట్టణంలోని ఓ పోలింగ్ కేంద్రం వద్ద ప్రారంభం అయిన వివాదం చిలికిచిలికి గాలివానలా మారింది. మంగళవారం ఉదయం నుంచి సాయంత్రం దాకా పట్టణంలో ఈ రెండు పార్టీల మధ్య దారులు ఒకరిపై ఒకరు దాడులు, ప్రతిదాడులు చేసుకున్నారు. ఈ దాడులతో తాడిపత్రిలో భయానక వాతావరణం నెలకొంది. ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని ప్రజలు బిక్కుబిక్కుమంటూ రోజంతా గడిపారు.

తాడిపత్రి పట్టణంలో వైసిపి కార్యకర్తలు పట్టణంలో ఉన్న టిడిపి నాయకుడు సూర్యముని ఇంటిపై మంగళవారం ఉదయం దాడి చేయడానికి ప్రయత్నించారు. ఈ సమయంలో అక్కడే ఉన్న టిడిపి నాయకులు ప్రతిదాడిగా రాళు రువ్వారు. ఈ నేపథ్యంలో ఇరువు వర్గాలను పోలీసులు చెదరగొట్టారు. టిడిపి, వైసిపి నాయకులు రాళ్లు రువ్వుకునే క్రమంలో అదుపు చేసేందుకు వెళ్లిన తాడిపత్రి పట్టణ సిఐ మురళీకష్ణ తలకు రాయి తగిలి గాయం అయ్యింది. వైసిపి నాయకులు సూర్యముని ఇంటిపై చేసిన దాడి విషయాన్ని తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే జెసి ప్రభాకర్ రెడ్డి పట్టణ పోలీస్ స్టేషన్ ఎదుట టిడిపి మద్దతుదారులతో కలిసి ఆందోళనకు దిగారు. అనంతరం అక్కడి నుంచి నేరుగా ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి ఇంటి వైపు ర్యాలీగా వెళ్లేందుకు ప్రయత్నించారు. పెద్దారెడ్డి ఇంటి వద్దకు టిడిపి మద్దతుదారులు వెళ్తే పరిస్థితి మరింత ఉద్రిక్తంగా మారుతుందని గ్రహించిన పోలీసులు అడ్డుకునే ప్రయత్నం చేశారు. వెంటనే ఉన్నతాధికారులకు సమాచారం ఇచ్చి ప్రత్యేక బలగాలను తాడిపత్రికి రప్పించారు. పోలీసులు ఎంత ప్రయత్నించినా పరిస్థితి అదుపులోకి రాకపోవడంతో టియర్ గ్యాస్‌ను ప్రయోగించారు. అయినా టిడిపి మద్దతుదారులు ఏమాత్రం లెక్కచేయకుండా ఎమ్మెల్యే కేతిరెడ్డి ఇంటి వైపు వెళ్లారు. ఈ సమయంలో మార్గమధ్యంలో వైసిపి నాయకులు కూడా వందలాదిమంది కార్యకర్తలతో ఎదురుగా వచ్చారు. పట్టణంలోని గవర్నమెంట్ జూనియర్ కాలేజీ క్రీడా మైదానంలో ఇరు గ్రూపులు మరోసారి ఒకరిపైఒకరు రాళ్లు రువ్వుకున్నారు. దాదాపు మూడు గంటలసేపు రాళ్లు విసురుకోవడంతో ఆ ప్రాంతంలో హైటెన్షన్ నెలకొంది. ఇందులో ఓ వైసిపి కార్యకర్తకు తీవ్ర గాయాలయ్యాయి. గాయపడిన వైసిపి కార్యకర్తను ఆసుపత్రికి తరలించాగా పరిస్థితి విషమంగా అన్నట్లు వైద్యులు తెలిపారు. వైసిపి, టిడిపి మద్దతుదారులు దాడులు, ప్రతిదాడులను నిలువరిచేందుకు పోలీసులు విశ్వప్రయత్నం చేశారు. ఎంత సేపటికీ గొడవలు సర్దుమనగక పోవడంతో పోలీసులు కేంద్ర బలగాల సహాయంతో లాఠీఛార్జీ చేశారు. రాత్రి 8 గంటల సమయంలో పరిస్థితి కాస్త అదుపులోకి వచ్చింది. మధ్యాహ్నం నుంచి రాత్రి వరకు తాడిపత్రి ప్రజలు భయాందోళన మధ్య ప్రజలు బిక్కుబిక్కుమంటూ గడిపారు. ఎప్పుడు ఏ ఘటన చోటు చేసుకుంటోందన్న ఆందోళన తాడిపత్రి ప్రజల్లో కన్పిస్తోంది.



దాడిలో గాయపడిన సిఐ, కానిస్టేబుల్

నామమాత్రంగా పోలీసు చర్యలు

పట్టణంలో పోలింగ్ రోజున జరిగిన దాడికి ప్రతిదాడిగా మళ్లీ దాడులు జరుగుతాయన్న ఆలోచన పట్టణంలో నెలకొంది. పరిస్థితి ఇలా ఉన్నా పోలీసు వ్యవస్థ నిర్లక్ష్యంగా వ్యవహరించడం వల్లే మంగళవారం నాడు తాడిపత్రిలో ఇరువర్గాలు మరోసారి రాళ్ల దాడులకు పాల్పడే పరిస్థితి నెలకొంది. పోలీసులు నిష్పక్షపాతంగా వ్యవహరించి 144 సెక్షన్‌ను పూర్తిస్థాయిలో అమలు చేసే విధంగా చర్యలు చేపట్టాలని ఇరు వర్గాలు రెచ్చిపోకుండా ఎప్పటికప్పుడు అరెస్టు చేసి చర్యలు చేపట్టాలని తాడిపత్రి పట్టణ ప్రజలు కోరుకుంటున్నారు.

గాయపడ్డ వైసిపి కార్యకర్త పరిస్థితి విషమం

రాళ్లదాడుల్లో గాయపడిన కడప జిల్లా కొండాపురం మండలం కోడూరు గ్రామానికి చెందిన నాగేశ్వర్ రెడ్డి తలకు రాయి తగిలి తీవ్ర గాయం అయ్యింది. దీంతో హుటాహుటిన నాగేశ్వర్‌రెడ్డి స్థానిక ఆసుపత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు పరిస్థితి విషమంగా ఉన్నట్లు వైద్యులు తెలపడంతో మెరుగైన వైద్యం కోసం అనంతపురం తరలించినట్లు వైసిపి నాయకులు తెలిపారు.


రాప్తాడు మండలంలో సాయంత్రం అయినా భారీగా క్యూలో ఉన్న ఓటర్లు

రాప్తాడులో 85.05 శాతం పోలింగ్

అనంతపురం : రాప్తాడు నియోజకవర్గంలో సోమవారం రాత్రి వరకూ పోలింగ్ జరగడంతో 85.05 శాతం పోలింగ్ నమోదైంది. నియోజకవర్గంలో 2,50,571 ఓటర్లు ఉండగా జరిగిన 2,13,207 మంది ఓటుహక్కు వినియోగించుకున్నారు. రామగిరి మండలంలో 90.49, ఆత్మకూరు మండలంలో 90, కనగానపల్లి మండలంలో 89.88, చెన్నేకొత్తపల్లి మండలంలో 88.55, రాప్తాడు మండలంలో 84.84, అనంతపురం రూరల్ మండలంలో 77.53 శాతం నమోదైంది.

రాయదుర్గంలో 86.96 శాతం..

రాయదుర్గం : రాయదుర్గం అసెంబ్లీ నియోజకవర్గం పరిధిలో 86.96 శాతం పోలింగ్ నమోదైంది. నియోజకవర్గంలో 2,64,352 మంది ఉండగా 2,27,248 మంది ఓటుహక్కు వినియోగించుకున్నారు. మండలాల వారీగా రాయదుర్గం మండలంలో 88.61, గుమ్మఘట్టలో 88.50, బొమ్మనహాల్‌లో 86.39, డి.హీరేహాల్‌లో 89.73, కణేకల్లు మండలంలో 80.54 శాతం, రాయదుర్గం పట్టణంలో 80.54 శాతం ఓట్లు పోలయ్యాయి. నియోజకవర్గంలో పురుషులతో పోల్చితే మహిళలు మూడు వేల మంది అధిక ఓటర్లు ఉన్నప్పటికీ పోలింగ్ శాతం విషయంలో పురుషుల కంటే 2.5 శాతం తక్కువ ఓట్లు పోలయ్యాయి.

కళ్యాణదుర్గంలో 88.62 శాతం..

కళ్యాణదుర్గం : కళ్యాణదుర్గం నియోజకవర్గంలో 88.62 శాతం పోలింగ్ నమోదైనట్లు ఆర్‌ఒ రాణిసుస్మిత తెలిపారు. సోమవారం రాత్రి పొద్దుపోయే వరకూ వివిధ పోలింగ్ కేంద్రాల్లో ఓటింగ్ కొనసాగింది. దీంతో ఓటర్లు, పోలింగ్ సిబ్బంది కొంత ఇబ్బందులకు గురయ్యారు. నియోజకవర్గంలో 2.30785 లక్షల ఓటర్లు ఉండగా 204515 మంది ఓటుహక్కు వినియోగించుకున్నారు. ఇంత పెద్దసంఖ్యలో ఓటర్లు పోలింగ్‌లో పాల్గొనడం గర్వకారణమన్నారు.

గెలుపుపై ఎవరి లెక్కలు వారివే..!

లెక్కలేసుకుంటున్న అధికార, ప్రతిపక్ష నాయకులు-రాయదుర్గంలో అభ్యర్థుల ధీమా

ప్రజాశక్తి-రాయదుర్గం


కాలవ శ్రీనివాసులు


మెట్టు గోవిందరెడ్డి

సార్వత్రిక ఎన్నికల పోలింగ్ అనంతరం రాయదుర్గం అసెంబ్లీ నియోజకవర్గంలో ప్రధాన పార్టీల అభ్యర్థులు గెలుపుపై ఎవరికి ధీమా వారు వ్యక్తం చేస్తున్నారు. రాత్రి పొద్దుపోయేదాకా ఓటర్లు బారులుదీరి ఓట్లు వేయడంతో నియోజకవర్గవ్యాప్తంగా 87శాతం పోలింగ్ నమోదైంది. గతంలో జరిగిన అసెంబ్లీ ఎన్నికల ఫలితాలను పరిశీలిస్తే 2009లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి కాపు రామచంద్రారెడ్డి తన సమీప టిడిపి అభ్యర్థి మెట్టు గోవిందరెడ్డిపై 14,091 ఓట్ల మెజారిటీతో గెలుపొందారు. 2012లో జరిగిన ఉప ఎన్నికల్లో వైసిపి తరపున పోటీ చేసిన కాపు రామచంద్రారెడ్డి, సమీప టిడిపి ప్రత్యర్థి దీపక్‌రెడ్డిపై 32,476 ఓట్ల ఆధిక్యతతో గెలుపొందారు. 2014లో టిడిపి అభ్యర్థి కాలవ శ్రీనివాసులు, వైసిపి అభ్యర్థి కాపు రామచంద్రారెడ్డి పై 1827 ఓట్ల స్వల్ప మెజారిటీతో గెలుపొందారు. 2019లో వైసిపి అభ్యర్థి కాపు రామచంద్రారెడ్డి, టిడిపి అభ్యర్థి కాలవ శ్రీనివాసులుపై 14,476 ఓట్ల ఆధిక్యంతో గెలుపొందారు. ప్రస్తుతం టిడిపి తరపున కాలవ శ్రీనివాసులు, వైసిపి తరపున మెట్టు గోవిందరెడ్డి పోటీలో ఉన్నారు.ప్రచారంలో కూడా ఎవరికి వారుగా ప్రచారం చేసుకున్నారు. వీరికి ఆయా పార్టీల ముఖ్య నేతల నుంచి సంపూర్ణ మద్దతు లభించింది లేదు. ముఖ్యంగా గతంలో టిడిపి మాజీ ఎమ్మెల్సీ గుణపాటి దీపక్‌రెడ్డి, జెడ్పీ మాజీ అధ్యక్షులు పూల నాగరాజు ఎన్నికల ప్రచారంలో ఎక్కడా కనిపించలేదు. అంతేకాక గతంలో ప్రత్యర్థిగా ఉన్న కాపు రామచంద్రారెడ్డి వైసిపిని వీడి బిజెపిలో చేరారు. దీంతో కూటమి అభ్యర్థిగా కాలవ శ్రీనివాసులు విజయానికి రామచంద్రారెడ్డి ప్రత్యక్షంగా ఎలాంటి ఎన్నికల ప్రచారం చేయలేదు. అయినప్పటికీ జనసేన నాయకులు కరేగొండ్ర మంజునాథ్‌గౌడ్‌తోపాటు స్థానిక బిజెపి నాయకులు కాలవ శ్రీనివాసులు గెలుపునకు ప్రచారంలో ముమ్మరంగా పాల్గొన్నారు. వైసిపి అభ్యర్థి గోవిందరెడ్డికి వైసిపి నియోజకవర్గ బాధ్యతలు అప్పగించాక ఎమ్మెల్యే కాపు రామచంద్రారెడ్డి దూరమయ్యారు. దీంతో ఆయనతోపాటు కుటుంబ సభ్యులు కూడా ప్రచారం నిర్వహించారు. వీరితోపాటు పలువురు ఇండిపెండెంట్ అభ్యర్థులు పోటీలో నిలిచారు. అయితే ఎవరూ గట్టి పోటీ ఇచ్చే అవకాశం లేదని విశ్లేషకులు చెబుతున్నారు. ఎన్నికలకు సుదీర్ఘ సమయం, ప్రచారానికి గడువు ఉన్నట్లే ఓట్ల లెక్కింపు కూడా సుమారు 20 రోజులు వ్యవధి ఉండటంతో ఎన్నికల్లో గెలుపు పై ఎవరి అంచనాలు వారు లెక్క వేసుకుంటున్నారు. ఏదిఏమైనా ఎన్నికల ఫలితాల కోసం మరో మూడు వారాలపాటు వేచి ఉండక తప్పదు.

నేరాలు ఘోరాలు

ట్రాక్టర్ బోల్తా.. కూలీ మృతి


మృతిచెందిన సూరి

వజ్రకరూరు : ట్రాక్టర్ బోల్తా పడి వ్యక్తి మృతిచెందిన ఘటన వజ్రకరూరు మండల కేంద్రం సమీపంలో మంగళవారం చోటు చేసుకుంది. పోలీసులు, బంధువులు తెలిపిన వివరాల మేరకు.. ఉరవకొండ మండలం చిన్న ముష్టూరు నుంచి బండల లోడ్‌తో వజ్రకరూరుకు వస్తుండగా ట్రాక్టర్ ఇంజన్ పెద్ద టైర్ పంచర్ కావడంతో వజ్రకరూరు వద్ద బోల్తా పడింది. దీంతో కూలి పని చేసుకున్న సూరి బండల కింద పడి అక్కడికక్కడే మృతిచెందాడు. మరో ఇద్దరు కూలీలు హొన్నూరుస్వామి, మల్లికార్జునకు గాయాలయ్యాయి. గాయపడ్డ వారిని ఆసుపత్రికి తరలించారు. మృతదేహాన్ని ఉరవకొండ ప్రభుత్వాసుపత్రికి పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. కేసు నమోదు చేసుకుని పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

గుత్తి : మండలంలోని శ్రీపురం గ్రామ సమీపంలో 67వ జాతీయ రహదారిపై మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. గుంతకల్లు నుంచి గుత్తికి వస్తున్న ఆటో శ్రీపురం గ్రామం వద్ద అదుపు తప్పి బోల్తా పడింది. ప్రమాదంలో గుంతకల్లు మండలం నక్కనదొడ్డి గ్రామానికి చెందిన లోలోనాయక్, గుత్తి మండలం తురకపల్లి గ్రామానికి చెందిన సుంకన్నలకు తీవ్ర గాయాలయ్యాయి. అటువైపు కారులో వెళ్తున్న కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి గుమ్మనూరు జయరామ్ సోదరుడు గుమ్మనూరు శ్రీనివాసులు క్షతగాత్రులను వాహనంలో గుత్తి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసుకుని తర్వాత చేపట్టారు.

సిఐకి గాయాలు


ప్రమాదానికి గురైన రాయదుర్గం సీఐ వాహనం

కళ్యాణదుర్గం : మున్సిపాలిటీ పరిధిలోని గూబనపల్లి సమీపంలో మంగళవారం తెల్లవారుజామున రాయదుర్గం సీఐ వాహనం ప్రమాదానికి గురైంది. ఎన్నికల విధులు పూర్తి చేసుకుని కళ్యాణదుర్గం నుంచి రాయదుర్గం వెళుండగా గుర్తు తెలియని లారీ అతివేగంగా వచ్చి ఢీకొంది. ఈ ప్రమాదంలో బొలేరో వాహనం బోల్తా పడింది. ఇందులో ప్రయాణిస్తున్న రాయదుర్గం రూరల్ సీఐ శ్రీనివాసులు డ్రైవర్‌కు గాయాలయ్యాయి. విషయం తెలుసుకున్న కళ్యాణదుర్గం డీఎస్పీ శ్రీనివాసులు ప్రత్యేక వాహనంలో మెరుగైన చికిత్స నిమిత్తం అనంతపురం ఆసుపత్రికి తరలించారు. గుర్తు తెలియని వాహనాన్ని పోలీసులు ఛేదించేందుకు కసరత్తు చేస్తున్నారు.

వ్యవసాయ కేబుల్ వైర్ ధ్వంసం


ధ్వంసం చేసిన కేబుల్‌ను చూపుతున్న రైతు

పుట్లూరు : మండల పరిధిలోని చెర్లోపల్లి గ్రామానికి టిడిపి నాయకుడు నరేష్‌నాయుడుకు చెందిన తోటలో సోమవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు మోటార్ కేబుల్ వైర్‌ను ధ్వంసం చేశారు. బాధిత రైతు తెలిపిన వివరాల మేరకు.. మంగళవారం ఉదయాన్నే తోటకు వెళ్లి చూడగా కేబుల్ వైర్‌ను రాయితో ముక్కలు ముక్కలు చేసినట్లు గుర్తించాడు. వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు రైతు తెలిపారు.

కొత్తూరులో ఇరువర్గాల ఘర్షణ

కళ్యాణదుర్గం : మండల పరిధిలోని పుత్తూరు గ్రామంలో వైసిపి, టిడిపి వర్గీయుల మధ్య మంగళవారం ఘర్షణ చోటు చేసుకుంది. చిన్నపాటి సమస్య తలెత్తడంతో వైసిపి కార్యకర్తలు మంజు, పాతలింగ, నరసింహులు, అదే గ్రామానికి చెందిన బోయ నర్సింహులు, కుటుంబ సభ్యులపై దాడి చేశారు. దీంతో గాయాలు కావడంతో అనంతపురం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. రూరల్ సిఐ చంద్రశేఖర్ బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆలయంలో అన్నదానం

అనంతపురం : పుట్టినిల్లు ఆశ్రమం ఆధ్వర్యంలో సోములదొడ్డి పంచాయతీలోని నవయుగ కాలనీలో ఉన్న పెద్దమ్మ ఆలయం వద్ద అన్న ప్రసాద వితరణగావించారు. నిత్యసురభి ఛారిటబుల్ ట్రస్టు సభ్యులు మేఘనశ్రీ, బాలాజీ పెళ్లిరోజును పురస్కరించుకుని అన్న సంతర్పణ కార్యక్రమానికి సహకరించినట్లు ట్రస్టు ఛైర్‌పర్సన్ నిర్మలమురళి తెలిపారు. ఈ కార్యక్రమంలో ట్రస్టు సభ్యులు సౌధామణి, అర్చకులు జి.రాజు, కాలనీవాసులు భారతి, వరలక్ష్మి, లక్ష్మీనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

సిబిఎస్‌సి ఫలితాల్లో 'సంసిద్' విజయభేరి

ప్రజాశక్తి-అనంతపురం


ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులు

ఇటీవల విడుదలైన సిబిఎస్‌సి 10, 12వ తరగతుల ఫలితాలలో సంసిద్ విద్యాసంస్థ విద్యార్థులు వందశాతం ఉత్తీర్ణత సాధించి విజయభేరి మోగించారు. పదో తరగతిలో 500కు 454 మార్కులతో సాహితీ బాయి ప్రథమ స్థానంలో నిలిచింది. ద్వితీయ స్థానంలో శ్రీధృతి (441), తృతీయ స్థానంలో నేహాజుద్దీన్ (416) నిలిచారు. అలాగే 12వ తరగతిలో కృష్ణచైతన్య 87 శాతంతో ప్రథమ స్థానంలో నిలిచాడు. ఈ సందర్భంగా సంసిద్ పాఠశాల ఛైర్మన్ శ్రీవాసా శ్రీనివాసరావు మాట్లాడుతూ పాఠశాల స్థాపించిన నాటి నుంచి వందశాతం ఫలితాలను సాధిస్తూ తన విశిష్టతను నిలబెట్టుకుంటోందన్నారు. ఈ విజయానికి ముఖ్య కారకులైన పాఠశాల ప్రిన్సిపల్ ఎం.చంద్రశేఖర్, వైస్ ప్రిన్సిపల్ మధునిక, ఉపాధ్యాయుల బృందం, విద్యార్థులు, తల్లిదండ్రులకు ప్రత్యేక అభినందనలు తెలిపారు.

విజయ బావుటా ఎగురవేస్తాం

ఎమ్మెల్యే అభ్యర్థి వై.విశ్వేశ్వరరెడ్డి

ప్రజాశక్తి-వజ్రకరూరు


విలేకరులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అభ్యర్థి వై.విశ్వేశ్వరరెడ్డి

రాష్ట్రంలో వైసిపి అధికారంలోకి రావడం ఖాయమని ఆ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి వై.విశ్వేశ్వరరెడ్డి ధీమా వ్యక్తం చేశారు. మంగళవారం స్థానిక వైసిపి కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పోలింగ్ సరళి చుస్తే ఎన్నికల ఫలితాలు వైసిపికి అనుకూలంగా ఉన్నట్లు స్పష్టమవుతోందన్నారు. చంద్రబాబు దుష్ప్రచారాలను ప్రజలు నమ్మలేదన్నారు. రాష్ట్రంలో మరోసారి జగన్ ప్రభుత్వం వస్తుందని ధీమా వ్యక్తం చేశారు. పోలింగ్ సందర్భంగా వైసిపికి అనుకూలంగా ఓటు వేస్తుంటే జీర్ణించుకోలేక టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి పయ్యావుల కేశవ్, ఆ పార్టీ శ్రేణులు నియోజకవర్గంలో అక్కడక్కడ దుందుడుకు చర్యలకు పాల్పడ్డారని ఆరోపించారు. ముఖ్యంగా బెలుగుప్ప, మరుట్లలో వైసిపి నాయకులపై దాడులు చేశారన్నారు. ఓటమి భయంతో ఇటువంటి చర్యలకు పాల్పడ్డారని విమర్శించారు. కౌకుంట్ల పంచాయతీలోని వై.రాంపురంలో హత్యకేసులో ముద్దాయిలైన సంజీవరాయుడును పోలింగ్ ఏజెంట్లుగా పెట్టి ఓటర్లను భయభ్రాంతులకు గురి చేశారన్నారు. పయ్యావుల కేశవ్, ఆయన సోదరుడు పయ్యావుల శ్రీనివాసులు వందలాది మందితో పలు పోలింగ్ కేంద్రాలకు తరలివెళ్లి ఓటర్లను భయపెట్టే ప్రయత్నం చేశారని ఆరోపించారు. దీనికితోడు ఎన్నికల అధికారులను కూడా బెదిరించారన్నారు. వారు ఎన్ని కుయుక్తులు చేసినా ప్రజలకు వైసిపికే పట్టం కడతారని ధీమా వ్యక్తం చేశారు. తాను గెలిశాక నియోజకవర్గ అభివృద్ధి కోసం ప్రత్యేక ప్రణాళిక సిద్ధం చేసుకున్నట్లు తెలిపారు. ముఖ్యంగా ఉరవకొండ సమగ్రాభివృద్ధికి పాటుపడతానన్నారు. కష్టపడి పని చేసిన నాయకులు, కార్యకర్తలకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సమావేశంలో వైసిపి బీసీ విభాగం జిల్లా అధ్యక్షులు వీరన్న, ఎంపిపి నర్సింహులు, వైస్ ఎంపిపి శ్రీనాథ్‌రెడ్డి, పట్టణ కన్వీనర్ ఎసి ఎర్రిస్వామి, సమన్వయకర్త ఓబన్న, ఆమిద్యాల పిఎసిఎస్ ఛైర్మన్ తేజోనాథ్, మాజీ జడ్పిటిసి తిప్పయ్య, నాయకులు కరణం భీమిరెడ్డి, బసవరాజు, ధనుంజయ పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి 'అమ్మ' అండ

ప్రజాశక్తి-అనంతపురం


ఆర్థికసాయం అందజేస్తున్న అమ్మ సంస్థ అధ్యక్షులు తరిమెల రమణారెడ్డి

బుక్కరాయసముద్రం మండలం జంతులూరులో నివాసం ఉంటున్న బాధిత కుటుంబానికి అమ్మ సంస్థ అధ్యక్షులు తరిమెల రమణారెడ్డి మంగళవారం ఆర్థికసాయం అందజేశారు. వివరాల్లోకి వెళ్తే.. జంతులూరు గ్రామంలో నివసిస్తున్న హరిజన బళ్లారి రవికుమార్, భార్య లక్ష్మీదేవికి ముగ్గురు ఆడపిల్లలు. ఇందులో మొదటి ఇద్దరూ మానసిక వికలాంగులు. 3వ పాప 6వ తరగతి చదువుతోంది. ఈనేపథ్యంలో కారు డ్రైవర్‌గా పని చేస్తున్న రవికుమార్‌కు రెండేళ్ల క్రితం జరిగిన బైకు ప్రమాదంలో వెన్నెముక దెబ్బతింది. దీంతో ఇంటికే పరిమితమయ్యాడు. ఈనేపథ్యంలో కుటుంబ పోషణ భారమైంది. విషయం తెలుసుకున్న అమ్మ సంస్థ అధ్యక్షులు తరిమెల రమణారెడ్డి గ్రామానికి వెళ్లి రూ.50వేల విలువజేసే అవసరమైన వంట సామగ్రి, పిల్లలకు దుస్తులు, వైద్య ఖర్చులకు రూ.20వేలు ఆర్థికసాయం అందజేశారు. అలాగే చిన్న అమ్మాయి చదువుకు అయ్యే ఖర్చు అమ్మసంస్థ భరిస్తుందని హామీ ఇచ్చారు. అంతేగాకుండా ప్రస్తుతం గుడిసె ఉండటంతో వచ్చే నెలలో ఇల్లు కట్టించేందుకు కృషి చేస్తామని తెలిపారు. సహాయం అందించిన అమ్మసంస్థ వ్యవస్థాపకులు రమణారెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

ఓటమి భయంతోనే టిడిపి నాయకుల దాడులు

ప్రజాశక్తి-బెలుగుప్ప


బాధితులను పరామర్శిస్తున్న వైసిపి ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థులు వై.విశ్వేశ్వర్‌రెడ్డి, శంకరరాయణ

ఓటమి భయంతో టిడిపి నాయకులు వైసిపి నాయకులపై దాడులు చేశారని మండల వైసిపి అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వైసిపి మండల అధ్యక్షులు చిన్న మచ్చున్న, వాల్మీకి కార్పొరేషన్ డైరెక్టర్ రామాంజనేయులు మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికల అనంతరం టిడిపి కనుమరుగవుతుందని భయాందోళన టిడిపి నాయకుల్లో ఎక్కువైందన్నారు. దీంతోనే వైసిపి నాయకులు, సహకార సంఘం అధ్యక్షులు బి.శివలింగప్ప, ఉపసర్పంచి పాతన్న బాబురెడ్డి, పంచాయతీ వార్డు సభ్యులు హరిజన పెద్దన్నపై టిడిపి నేతలు నాయకులు మూకుమ్మడిగా దాడి చేయడం దుర్మార్గమన్నారు. ప్రజలు వైసిపికి సానుకూలంగా ఓట్లు వేస్తుండటంతో టిడిపి నాయకులు జీర్ణించుకోలేకపోయారన్నారు. దీంతో భరించలేక దాడులకు పాల్పడుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో సహకార సంఘం అధ్యక్షులు బి.శివలింగప్ప, జెసిఎస్ కన్వీనర్ పి.శ్రీనివాసులు, మాజీ సర్పంచి జె.రామేశ్వరరెడ్డి, బోయ వెంకటేశులు, పాతన్న, భాస్కర్‌రెడ్డి, ముత్యాలరెడ్డి, తిమ్మారెడ్డి, రమేపల్లి రమేష్, వెంకట్‌రెడ్డి, పురుషోత్తం, పూల ప్రసాద్, హరిజన పెద్దన్న, నరేంద్ర, వైసిపి నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

బాధితులకు పరామర్శ

దాడిలో గాయపడిన వైసిపిపి నాయకులను వైసిపి ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థులు వై.విశ్వేశ్వర్‌రెడ్డి, శంకరరాయణ పరామర్శించారు. గాయపడిన శివలింగప్ప, బాబురెడ్డి, హరిజన పెద్దన్న, స్వగృహాలకు వెళ్లి పరామర్శించి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్నికల్లో భాగంగా టిడిపి నాయకులు వైసిపి నాయకులపై దాడి చేయడం చాలా దుర్మార్గమన్నారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

గుత్తి ఉపకారాగారం తనిఖీ


ఖైదీలను సమస్యలను అడిగి తెలుసుకుంటున్న జిల్లా 6వ అదనపు న్యాయమూర్తి ఎం.శ్రీహరి

గుత్తి : పట్టణంలోని ప్రత్యేక ఉపకారాగారాన్ని మండల న్యాయ సేవా సమితి అధ్యక్షులు, జిల్లా 6వ అదనపు న్యాయమూర్తి ఎం.శ్రీహరి మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఇందులో భాగంగా కారాగారంలో పరిసరాలను పరిశీలించారు. స్టోర్ రూమ్‌లో ఉన్న నిత్యావసర వస్తువులను తనిఖీ చేసి జైలులో సౌకర్యాల గురించి ఖైదీలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో జైలు సూపరింటెండెంట్ వెంకటేశ్వరుడు, కోర్టు టైపిస్ట్ సాదిక్‌వలి, తదితరులు పాల్గొన్నారు.


బాధితుడిని పరామర్శిస్తున్న శంకరానారాయణ

వైసిపి నాయకులపై దాడి దుర్మార్గం : శంకరనారాయణ

అనంతపురం : పెద్దవడుగూరు మండలం దిమ్మగుడి గ్రామానికి చెందిన వైసిపి నాయకులు ఎస్సీ ఆదినారాయణపై టిడిపి నాయకులు దాడి చేయడం దుర్మార్గమని వైసిపి పార్లమెంట్ అభ్యర్థి మాలగుండ్ల శంకరనారాయణ అన్నారు. టిడిపి నాయకుల దాడిలో తీవ్రంగా గాయపడి అనంతపురం ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ఆదినారాయణను పరామర్శించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ టిడిపి నాయకులు ఓటమి భయంతోనే దాడులు చేస్తున్నారని ఆరోపించారు. వైసిపి నాయకులు, కార్యకర్తలు సమిష్టి కృషి, రాష్ట్ర ప్రజల సహకారంతో మరోసారి జగన్ సిఎం కాబోతున్నారన్నారు. ఇలాంటి దాడులకు వైసిపి నాయకులు, కార్యకర్తలు భయపడరన్నారు. రాష్ట్ర ప్రజలే టిడిపి నాయకులకు తగిన బుద్ధి చెబుతారని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

కుటుంబ సభ్యులతో గడిపిన 'అనంత'

పోల్ మేనేజ్‌మెంట్ దిగ్విజయంపై అభినందనలు

ప్రజాశక్తి-అనంతపురం


కుటుంబ సభ్యులతో గడుపుతున్న అనంత వెంకటరామిరెడ్డి

నిన్నటి వరకూ ఎన్నికల ప్రచారం, పోలింగ్‌పై తీరిక లేకుండా గడిపిన వైసిపి అనంతపురం ఎమ్మెల్యే అభ్యర్థి అనంత వెంకటరామిరెడ్డి మంగళవారం కుటుంబ సభ్యులతో సంతోషంగా గడిపారు. సోమవారం పోలింగ్ ముగియడంతో ఆ రోజు రాత్రి, మంగళవారం ఉదయం నుంచి పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులతో వరుసగా భేటీ అయ్యారు. ఎన్నికల్లో బూత్‌ల వారీగా పోలైన ఓట్లు, పోలింగ్ సరళి, మెజారిటీ తదితర వివరాలపై ఆరాతీశారు. గెలుపు విషయంలో ప్రతి ఒక్కరూ ధీమా వ్యక్తం చేస్తూ ముందస్తుగా శుభాకాంక్షలు తెలిపారు. ఇక మధ్యాహ్నం తర్వాత కుటుంబ సభ్యులతో ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి సంతోషంగా గడిపారు. సోదరులు అనంత సుబ్బారెడ్డి, మాలతి, అనంత చంద్రారెడ్డి, సువర్ణ దంపతులు, కుమార్తె నవ్యత, సుబ్బారెడ్డి కుమార్తె మేఘన, మనవళ్లతో కలిసి రిలాక్స్ మోడ్‌లోకి వెళ్లిపోయారు. కాగా ఎన్నికల పోల్ మేనేజ్‌మెంట్‌ను దిగ్విజయం చేసిన నాయకులు, కార్యకర్తలను ఎమ్మెల్యే అనంత అభినందనలు తెలిపారు. పోలింగ్ సందర్భంగా ఓటు వేసిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు తెలిపారు.

శ్రావణిశ్రీ ఇంటి వద్ద అభిమానుల సందడి


మండల నాయకులతో బండారు శ్రావణిశ్రీ

పుట్లూరు : నియోజకవర్గంలోని టిడిపి శ్రేణులు మంగళవారం అనంతపురంలోని ఎమ్మెల్యే అభ్యర్థి బండారు శ్రావణిశ్రీ ఇంటి వద్ద సందడి చేశారు. కొన్నిచోట్ల పొద్దుపోయేంత వరకూ పోలింగ్ జరగడంతో మంగళవారం ఉదయం శ్రావణిశ్రీ ఇంటి వద్దకు చేరుకుని విజయంపై ధీమా వ్యక్తం చేశారు. అనంతరం అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా శ్రావణిశ్రీ మాట్లాడుతూ సాధారణ ఎన్నికల్లో గెలిపే ధ్యేయంగా కష్టపడి పనిచేసిన టిడిపి శ్రేణులు, ఉమ్మడి పార్టీల శ్రేణులకు ధన్యవాదాలు తెలిపారు.


ప్రజలందరికీ ప్రత్యేక కృతజ్ఞతలు

శింగనమల : భారీ ఎత్తున తరలివచ్చి ఓటింగ్‌లో పాల్గొన్న ప్రజలందరికీ వైసిపి ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు మాలగుండ్ల శంకరనారాయణ, వీరాంజనేయులు మంగళవారం ఒక ప్రకటనలో ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. అలాగే పోలింగ్‌ను ముందుండి శాంతియుతంగా నడిపించిన పోలింగ్ కేంద్రాల ఏజెంట్లు, అధికారులకు, ఎన్నికల్లో తమకు సహకరించిన మీడియా ప్రతినిధులు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

అనుచిత వ్యాఖ్యలు తగదు : వైసిపి

ప్రజాశక్తి-గుత్తి

టిడిపి నాయకులు తమపై అనుచిత వ్యాఖ్యలు చేయడం తగదని వైసిపి సీనియర్ నాయకులు, కబడ్డీ సంఘం జిల్లా అధ్యక్షుడు బి.శ్రీనివాస్‌రెడ్డి, సిబి.మంజునాథరెడ్డి అన్నారు. మంగళవారం గుత్తి ఆర్ఎస్‌లోని ఆర్కే ఫంక్షన్ హాల్‌లో వైసీపీ కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ టిడిపి నాయకులు వైసిపి నాయకులు, కార్యకర్తలపై బెదిరింపు ధోరణికి పాల్పడుతున్నారన్నారు. ఇంతవరకూ ఓర్చుకుని ఉన్నామని, తగిన బుద్ధి చెబుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు క్రషర్ మధుసూదన్‌రెడ్డి, డి.హుస్సేన్ పీరా, బేడల వెంకటరాముడు, మైనుద్దీన్, ప్రవీణ్‌కుమార్‌యాదవ్, గురుప్రసాద్ యాదవ్, ఎం.రంగస్వామి, బి.రమేష్‌రెడ్డి, జీపు రమణ, నారాయణస్వామి, పామిడి ఎంపీపీ బోగాతి మురళీమోహన్ రెడ్డి, కౌన్సిలర్లు ఫారుక్, వరద, తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న వైసిపి నాయకులు


విలేకరులతో మాట్లాడుతున్న శంకరనారాయణ

వెల్లువలా ఓటింగ్


అనంతపురం : ప్రభుత్వంలో సంక్షేమ లబ్ధిపొందిన వారు వెల్లువలా తరలివచ్చి ఓటింగ్‌లో పాలుపంచుకున్నారని వైసిపి అనంతపురం ఎంపి అభ్యర్థి శంకరనారాయణ అన్నారు. మంగళవారం స్థానిక పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మరోసారి ప్రజలు జగన్‌కు మద్దతు తెలిపారన్నారు. ఓటు వేసిన యువత, విద్యార్థులు, మహిళలందరికీ కృతజ్ఞతలు తెలిపారు. వైసిపి జిల్లా అధ్యక్షులు పైలా నరసింహయ్య మాట్లాడుతూ జిల్లాలో మెజారిటీ స్థానాలు సాధిస్తామన్నారు. మరో మారు తమ పార్టీనే వస్తోందన్నారు. ఓటు వేసిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞలు తెలిపారు.

టిడిపి కార్యకర్తల్లో నూతనోత్సాహం

కళ్యాణదుర్గం : ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరగడంతోపాటు అధికశాతం పోలింగ్ నమోదు కావడంతో టిడిపి కార్యకర్తల్లో నూతనోత్సాహం నెలకొంది. ఈమేరకు పట్టణంలోని ప్రజావేదిక వద్ద వివిధ గ్రామాల నుంచి నాయకులు, కార్యకర్తలు వేలాదిగా తరలివచ్చి ఎమ్మెల్యే అభ్యర్థి అమిలినేని సురేంద్రబాబుకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు మోరేపల్లి మల్లికార్జున, పాపంపల్లి రామాంజనేయులు, కరణం రామ్మోహన్‌చౌదరి, లక్ష్మీనారాయణ, వైపి.రమేష్, వెంకటేశులు, సర్పంచి కవితా బజ్జన్న, తదితరులు పాల్గొన్నారు.


టిడిపి ప్రజావేదిక వద్ద కార్యకర్తల కోలాహలం

అనంతపురం క్రికెట్ లీగ్ ప్రారంభం


క్రికెట్ లీగ్‌ను ప్రారంభిస్తున్న మాంచోఫెర్రర్

అనంతపురం : క్రీడాకారులను ప్రోత్సహించడానికి జిల్లా లీగ్‌లు చాలా కీలకమని ఆర్డీటీ డైరెక్టర్, ఎపిఎల్ గవర్నింగ్ కౌన్సిల్ ఛైర్మన్ మంచోఫెర్రర్ అన్నారు. అనంతపురం క్రికెట్ లీగ్ సీజన్-2 ప్రారంభం సందర్భంగా అనంత క్రీడాగ్రామంలోని బి.గ్రౌండ్‌లో ఫ్యామిలీ క్లబ్ వర్సెస్ ఇండియన్ సిక్సర్స్ మ్యాచ్‌ను మాంచోఫెర్రర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనంతపురం జిల్లాలో ఆర్‌డిటి గ్రామీణ క్రికెట్ టోర్నమెంట్‌తో ప్రారంభమై ఫుట్‌బాల్, హాకీ, టెన్నిస్, ఆర్చరీ, కబడ్డీ, జూడో తదితర క్రీడలను విస్తరింపజేసిందన్నారు. ఈ కార్యక్రమంలో ఎడిసిఎ అధ్యక్షులు పిఎల్ ప్రకాష్‌రెడ్డి, సెక్రటరీ, కె.మధుఆచారి, ఆర్డీటీ డైరెక్టర్ పి.సాయికృష్ణ, ఎడిసిఎ జాయింట్ సెక్రటరీ భీమలింగారెడ్డి, ట్రెజరర్ షబ్బీర్‌అహ్మద్, బిసిసిఐ లెవల్-2 కోచ్ ఎం.శ్రీవాస్‌రెడ్డి, రంజీ ట్రోఫీ మాజీ ప్లేయర్ కెఎస్ షహబుద్దీన్, అనంతపురం. మండల క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షులు కె.భాస్కర్‌రెడ్డి, కార్యదర్శి టివి చంద్రమోహన్‌రెడ్డి, టీమ్ స్పాన్సర్లు డాక్టర్ సుప్రజ, హరీష్‌యాదవ్, శ్రీనివాసులు, రామాంజి, కోచ్‌లు పి.మహేశ్వర్, ఆర్.కుమార్, ఆర్.ప్రవీణ్, షోయబ్, శంకర్ ధావన్, తదితరులు పాల్గొన్నారు.